కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజకీయ పార్టీల ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నియోజకవర్గ ఆర్వో విష్ణు చరణ్ మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. అనంతరం కౌంటింగ్ ఏజెంట్లకు ఓట్ల లెక్కింపు కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఇసి నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఏజెంట్లు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు,పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఖరీఫ్ దుక్కులు

విత్తనాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మృగశిర కార్తి సమీపిస్తున్న సమయంలో జోరుగా వ్యవసాయ పనులకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన చెదురు మదురు వర్షాలకు పొలాల్లోని కుంటల్లో నీరు చేరడంతో నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఖరీఫ్ దుక్కులు జోరుగా సాగుతున్నాయి. ఆర్‌బికెల ద్వారా రైతులకు రాయితీపై విత్తనాలను సమకూర్చనున్నట్లు ప్రకటించడంతో విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు పంపిణీ చేసేందుకు 29,283 క్వింటాళ్ల విత్తనాలను (అపరాలు, చోడి, వేరుశనగ, వరి) రాయితీపై ఆర్‌బికెల వద్ద రైతులకు అందించేందుకు సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. 29,283 క్వింటాళ్ల వరి, 9981 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను షెడ్యూల్డ్ మండలాల్లో గిరిజన రైతులకు 90శాతం రాయితీపై సరఫరా చేయనున్నట్టు తెలిపారు. రాబోయే ఖరీఫ్‌లో జిల్లాలో వరి సుమారు లక్షా 75వేల ఎకరాల్లో సాగుకు సిద్ధం కాగా, ఇందుకు అవసరమైన 26,416 క్వింటాళ్లు వరివిత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అలాగే గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు, సీతంపేట మండలాల్లో గిరిశిఖర గ్రామాల్లో చిరు ధాన్యాల సాగును పెద్ద ఎత్తున చేపట్టేందుకు గాను, రైతులను కావాల్సిన దాదాపు 110 క్వింటాళ్ల చిరు ధాన్యాల విత్తనాలను 90శాతం రాయితీపై సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు.

ఇదిలా ఉండగా మండలంలో 21వేల ఎకరాల విస్తీర్ణం సాగుభూములున్నప్పటికీ దానిలో 19వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. మండలంలోని 19 ఆర్‌బికెలకు గానూ 15 ఆర్‌బికెలకు ఇప్పటికే 1600 క్వింటాళ్ల వరి విత్తనాలను తరలించినట్లు చెప్పారు. బాలగోడబ, నర్సిపురం, పుట్టూరు, పెదమరికి రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలను తరలించిన అనంతరం పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ సహాయకులు విత్తనాలు అవసరమైన రైతులను గుర్తించినట్టు తెలిపారు. ఈ ఏడాది 1064, 1121, సోనామసూరి సాంబ మసూరి రకాల విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. భూమిలో సారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట, జీలుగు, కట్టే జనుము 300 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం చేశామని తెలుపుతూ పుత్తూరు, తాళ్లబురిడి, ఎమ్మార్ నగరం, సంగంవలస, ములగ రైతు భరోసా కేంద్రాల్లో కేంద్రానికి 12 టన్నుల చొప్పున యూరియా అందుబాటులో ఉంచామని తెలిపారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం జూన్ మొదటి వారంలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న సమాచారం ప్రకారం, జిల్లా అధికారులు ఇప్పటికే అన్ని మండలాలకు రైతుల అవసరార్థం ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరిపడే విత్తనాలను సరఫరా నిమిత్తం అందుబాటులో ఉంచారు. దీంతో రైతులు విత్తనాలు సేకరించుకొని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ముగించాలని పలువురు కోరుకుంటున్నారు.

నారుమడి దున్నుతున్న రైతు

8 గంటలకే ఓట్ల లెక్కింపు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఇవిఎం లెక్కింపునకు అర గంట ముందే ప్రారంభం అవుతుందన్నారు. లెక్కింపుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివరించారు. ఉద్యాన కళాశాలలో నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల ఇవిఎం ఓట్ల లెక్కింపుతో సహా అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన మొత్తం పోస్టల్ బ్యాలెట్లు, నాలుగు శాసన సభ నియోజక వర్గాల పరిధిలోని పార్లమెంటు ఇవిఎం ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపుకు 8 కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఒక కౌంటింగ్ హాల్ వెరసి 9 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇవిఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్‌లు, పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు 20 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రతి టేబుల్ వద్ద ఒక జిల్లా స్థాయి అధికారిని సహాయ రిటర్నింగ్ అధికారిగా, ఒక గెజిటెడ్ అధికారి, ఇతర సిబ్బంది ఉంటారని తెలిపారు. నియోజక వర్గం ఓట్ల లెక్కింపు కేంద్రంలో రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద రెండు టేబుళ్లు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాటు చేశామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వద్ద అభ్యర్థి గాని, ప్రధాన ఏజెంట్ గాని ఉండొచ్చన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు టేబుల్ వద్ద ఒక్కొక్క ఏజెంట్ ఉండొచ్చని చెప్పారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద జరిగే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వద్ద ఇద్దరు మైక్రో అబ్జర్వర్ ఉంటారని వివరించారు. 200మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. స్ట్రాంగ్ రూంలను తెరించేందుకు గాను అందరు ఏజెంట్లు ఉదయం 6.30 గంటల నాటికి లెక్కింపు కేంద్రం వద్దకు హాజరు కావాలని సూచించారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రానికి, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ హాళ్లను ఉద్యాన కళాశాలలో ఎ,బి,సి బ్లాకుల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. **అలాగే** కౌంటింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17 సి ఫారం, తెల్ల కాగితం మాత్రమే తేవాలని ఆయన స్పష్టం చేశారు.

ఇద్దరు సాధారణ ఎన్నికల పరిశీలకులు

లెక్కింపు సమయంలో ఎన్నికల కమిషన్ నియమించిన ఇద్దరు సీనియర్ ఐఎఎస్ అధికారులు సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా హాజరు కానున్నారని ఆయన చెప్పారు.

జిల్లాలో 144 సెక్షన్

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ అనంతరం పరిస్థితుల రీత్యా కొనసాగింపుపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. లెక్కింపు కేంద్రం వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశామన్నారు. 158 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లు నిరంతర నిఘాలో ఉంటాయని వివరించారు. ఇతరులు డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగరవేయకుండా నో ఫ్లై జోన్ గా ప్రకటించామని చెప్పారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వాహనాల పార్కింగ్ కేంద్రం బయట ఏర్పాటు చేశామని, నిర్దేశిత ప్రదేశంలో వాహనాలను నిలుపుదల చేయాలని స్పష్టం చేశారు. లెక్కింపు కేంద్రంలోనికి ప్రవేశించేవారికి విధిగా పాస్ ఉండాలని చెప్పారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎక్కడా ఎక్కువ మంది గుమిగూడరాదని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి అయ్యాయని, లెక్కింపు, లెక్కింపు అనంతరం కూడా జిల్లాలో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, ఎస్‌డిసి ఆర్ వి సూర్యనారాయణ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

బిత్రపాడులో శంకరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో కుక్కల బారిన పడి మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.25లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, కురుపాం నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ఎం.రమణ డిమాండ్ చేశారు. కుక్కల దాడిలో మృతి చెందిన నీరస శంకర్రావు, వెంకటరాజపురానికి చెందిన బంటు లక్ష్మి కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఏనుగులు, కుక్కలు దాడిచేసి మనుషులు , పశువుల ప్రాణాలను తీస్తుంటే జిల్లా అదికార యంత్రాంగం చోద్యం చూస్తుందే తప్ప తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నెల రోజుల్లో ఇద్దరి ప్రాణాలు తీసి, సుమారు 50 మంది వరకు గాయపర్చిన బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు కొల్లి గంగనాయుడు , బంటు దాసు తదితరులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో జోనల్ అధికారి తనిఖీ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు మంగళవారం సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.రత్నకుమారితో సమీక్ష జరిపి ఆసుపత్రిలో చేరుతున్న రోగుల జ్వరాల వివరాలు, వాటిలో మలేరియాగా నిర్ధారణ అయిన జ్వరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ మలేరియాతో చేరిన ఇద్దరి రోగుల ఆరోగ్య స్థితిని స్వయంగా వారు పరిశీలించి మాట్లాడి వారికి అందిస్తున్న చికిత్సా వివరాలు రికార్డులో పరిశీలించారు. వీరి ఆరోగ్యం మెరుగు పడే వరకు ఆసుపత్రిలో ఉంచి చికిత్స అందించాలన్నారు. అనంతరం ల్యాబ్ తనిఖీ చేసి ప్రతిరోజూ నిర్వహిస్తున్న జ్వరనిర్ధారణ పరీక్షలు, అందులో మలేరియా కేసులు ఏ మేరకు నిర్ధారణ అవుతున్నాయో, ఏఏ గ్రామాలకు చెందిన వారు వున్నారో రికార్డులను పరిశీలించారు. జ్వర లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి అని ఆదేశించారు. జిల్లాలో మొదటి విడత దోమల మందు పిచికారీ 401 మలేరియా ప్రభావిత గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతుందని తెలిపారు. వీరి వెంట ఎఎంఒ సూర్యనారాయణ, ఇఒ తిరుపతి రావు తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఏరియా ఆసుపత్రిలో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రిలో మలేరియా జ్వరపీడితులు అధికంగా ఉన్నారన్న అంశంపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఆసుపత్రిలో తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చేరిన రోగులకు అందుతున్న వైద్యం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో 80 బెడ్లు వుండగా 92 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారని చెప్పారు. ఆసుపత్రిలో రోగులను నేలపై వుంచి చికిత్స అందించే పరిస్థితి లేదని చెప్పారు. ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ సంఖ్య 302 వుందన్నారు. తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి, ఇతర వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ శివకుమార్ సూచించారు.

మలేరియా పై ముందస్తు చర్యలు చేపట్టండి

జియ్యమ్మవలస : మలేరియా నివారణకు వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ తెలిపారు. జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు, అధికార బృందంతో కలిసి మండలంలోని బల్లేరు, తుమ్మిగూడ, జియ్యమ్మ వలస పిహెచ్‌సిలను సందర్శించారు. మండలంలో మలేరియా ప్రభావిత గ్రామాల్లో జరుగుతున్న మొదటి విడత దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని బల్లేరులో తనిఖీ చేశారు. ఇంటింటికీ స్ప్రేయింగ్ చేపడుతున్న తీరును పరిశీలించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుమ్మిగూడలో ఇటీవల వచ్చిన ఒక మలేరియా కేసును సందర్శించి ఆరోగ్య స్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరాలపై ఆరా తీసి నిర్ధారణ పరీక్షలు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఫీవర్ సర్వలెన్సు, ఫ్రైడే ,డ్రై డే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టి మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాలు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం జియ్యమ్మవలస పిహెచ్‌సిలో ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ శంకర రావు,ఏఎంఒ సూర్యనారాయణ,సబ్ యూనిట్ అధికారి నారాయణ రావు,ఈఒ సూర్యనారాయణ,హెల్త్ సూపర్వైజర్ శ్రీహరిరావు మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరు ఏరియా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జోనల్ అధికారి శాంతిప్రభ

బేషరతుగా లాకౌట్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక జిందాల్ పరిశ్రమను లాకౌట్‌ను బేషరతుగా ఎత్తివేసి యధావిధిగా తిప్పాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు కోరారు. మంగళవారం కంపెనీ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి పాటలతో ఉర్రూతలూగించారు. కార్మికులలో నూతన ఉత్తేజాన్ని కలిగించారు. ఊగిసలాటలాడుతున్న కార్మికులకు తమ పాటలతో ఉత్సాహాన్ని కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా జిందాల్ పరిశ్రమను లాకౌట్ పేరుతో మూసివేసి కార్మికులను రోడ్డున పడేయడం విచారకర మన్నారు. కంపెనీలో 30-40 ఏళ్ల నుంచి పనిచేసిన కార్మికులు, రిటైర్మెంట్ దగ్గర పడుతున్న కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇన్నేళ్లు కార్మికుల రక్తాన్ని పిండి వృద్ధాప్యంలో పక్కకు నెట్టడం సమంజసం కాదని, బేషరత్‌గా లాకౌట్ ఎత్తివేసి కంపెనీ తిప్పాలని డిమాండ్ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లే ఆఫ్ ప్రకటించడాన్ని తప్పు పట్టారు. కంపెనీ మూసివేసి నేటికి 12 రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలన్నారు. మంగళవారం వంటావార్పు కోన తాతబాబు సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అప్పన్న పాలెం సర్పంచ్ కోన దేవుడు, జిందాల్ టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

ముగ్గురు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - జామి/విజయనగరంకోట

జామి మండలం జాగారం గ్రామం వద్ద గోస్తనీ నదిపై వాటర్ ఫాల్స్‌ను చూసేందుకు విజయనగరం కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ఆరుగురు విద్యార్థులు మంగళవారం ఉదయాన్నే వెళ్లారు. వాటర్ ఫాల్స్ వద్దకు చేరుకుని దిగువన నదిలో స్నానం చేస్తుండగా, గుల్లపాటి అనిల్ (14) అనే విద్యార్థి తొలుత నీటిలో మునిగిపోయాడు. అతన్ని కాపాడేందుకు ప్రయత్నించిన స్నేహితుడు మహ్మద్ అస్రఫ్ హుస్సేన్ (17) కూడా గల్లంతయ్యాడు. దీంతో మహమ్మద్ షాఖిబ్ ఖాన్ (16) నదిలో నుంచి బయలకు వచ్చి పెద్దపెద్ద కేకలు వేశాడు. ఎవరూ స్పందించకపోవడంతో ఆ విద్యార్థి కూడా వారిని కాపాడేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఒడ్డున ఉన్న మిగతా ముగ్గురూ అరుపులు కేకలు పెట్టి వెంటనే స్థానికులకు సమాచారమిచ్చారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ వీరబాబు హుటాహుటిన అక్కడకు చేరుకొని యువకుల కోసం గాలింపు చేపట్టారు. ఎస్.కోట ఫైర్ సిబ్బంది కూడా గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో విశాఖ నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రప్పించారు. మధ్యాహ్నం 1.30గంటలకు విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. నదిలో ఇసుక తవ్వకాల వల్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాటిలో కూరుకుపోయి మృతి చెందిన ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు, బంధువుల ఆర్తనాదాలతో జాగారం ప్రాంతంలో విషాదం అలముకుంది. మృతదేహాలను పోస్టుమార్టం జిల్లా కేంద్రానికి తరలించారు. సిఐ ఉపేంద్ర పర్యవేక్షణలో స్థానిక ఎస్ఐ వీరబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాగారం వాటర్ ఫాల్స్ నిషేదం

విజయనగరం, విశాఖ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అత్యధికంగా జాగారం వాటర్ ఫాల్స్‌ను చూసేందుకు వస్తుంటారు. గతంలో పలువురు ఇక్కడ స్నానానికి దిగి మృత్యువాత పడడంతో అధికారులు ఈ వాటర్ ఫాల్స్‌ను నిషేదించారు. కొంత కాలం పోలీసులు పహారా కూడా కొనసాగింది. కానీ సందర్శకులను నిలువరించ లేకపోయారు. ఈ నేపథ్యంలోనే తాజా ప్రమాదం చోటు చేసుకుంది. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో వాటర్ ఫాల్స్ ను నిషేదించడంగాని, ప్రమాదాల బారిన పడకుండా ఏర్పాట్లుగానిచేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కంటోన్మెంట్‌లో తీవ్ర విషాదం

కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ముగ్గురు ముస్లిం విద్యార్థులు మృతి చెందడంతో తీవ్ర విషాదం అలముకుంది. కళ్లెదుటే తమ స్నేహితులు నదిలో గల్లంతై విగత జీవులుగా మారడంతో కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలకు జిల్లా కేంద్రాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మృతి చెందిన గుల్లపాటి అనిల్ కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అతని తల్లితండ్రులకు మూడో సంతానం. మహమ్మద్ షాఖిబ్ ఖాన్ నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడు మృతితో తండ్రి షిరాజ్‌ఖాన్ కన్నీరుమున్నీరయ్యారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణంతో పాటు మండలంలోని పలుచోట్ల మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 101 వ జయంతోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడిగా, రాజకీయ నాయకుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ తెలుగుజాతికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ వక్తలు మాట్లాడారు. నర్సిపురంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొట్టాపు గౌరీ ఆధ్వర్యంలో టిడిపి అభిమానులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. తాళ్ల బురిడిలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గొట్టాపు గౌరీశ్వరి, మాజీ సర్పంచ్ బేత లక్ష్మణరావు, బుడితి శ్రీరామ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం : ఎన్టీయార్ జయంతోత్సవాలు గుమ్మలక్ష్మీపురం టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. తొలుత ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు పళ్ళు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ కీలక దాసు, కద్రక వెంకట్రావు, నాయకులు బుజ్జేశ్వరరావు, మహేశ్వర చిన్న, ధర్మ, అనిల్ బిడ్డిక సుధ, మండంగి చలపతిరావు, మడంకి రామారావు, కోటి పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎన్టీయార్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి పడాల భూదేవి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, మాజీ జడ్పిటిసి సభ్యులు సామంతులు దామోదరావు, గుమ్మడి సింహాద్రి, కోటదుర్గమ్మ ఆలయ మాజీ చైర్మన్ శాసపు సర్వారావు, పైల సత్యం నాయుడు, మజ్జి జయశంకర్, వావిలపల్లి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : నందమూరి తారక రామారావు యుగ పురుషుడు అని అటువంటి వ్యక్తి మన తెలుగు వాడు కావడం మనందరి అదృష్టమని రైతు సంఘం అధ్యక్షులు బూస తవుడు కొనియాడారు. మండలంలోని మామిడిపల్లిలో ఎన్టీఆర్ 101 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కేకు కట్ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి ఉపాధ్యక్షుడు తాడుతూరి తిరుపతిరావు, మత్స్య శ్యామ్, డొంక అన్నపూర్ణ, సుధాకర్, రామారావు, శ్రీను, కృష్ణ, వెంకటరమణ, తిరుపతి రావు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని ఎం.రాజపురంలో జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఎన్ పాండురంగ, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తి నాయుడు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, పి.నాగేశ్వరరావు, బల్ల హరిబాబు, మాచర్ల అనిల్, పారిచర్ల వెంకటరమణ, దవులూరు సత్యారావు, ఉమామహేశ్వరరావు, జనసేన జానీ, జామి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు ఎస్.శేఖర్‌పాత్రుడు ఆధ్వర్యాన ఎన్టీయార్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరాడలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గులిపల్లి సుదర్శనరావు, దేవకోటి వెంకటనాయుడు, నంగిరెడ్డి మధుసూధనరావు, పొట్నూరు వెంకటనాయుడు, సింహాచలంనాయుడు, పడాల హరిప్రసాద్, బిడ్డిక తమ్మయ్య, గొట్టాపు త్రినాథరావు, తదితరులు ఉన్నారు.

సీతానగరం : స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర, జోగింపేటలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ బొమ్మనేని లక్ష్మణరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు, అధ్యక్షులు పెంట సత్యంనాయుడు, పెదభోగిలి మాజీ సర్పంచి పి.శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ఎన్టీయార్‌కు నివాళ్లు అర్పిస్తున్న విజయచంద్ర, నాయకులు

గుమ్మలక్ష్మీపురంలో ఎన్టీయార్‌కు నివాళ్లు అర్పిస్తున్న జగదీశ్వరి, నాయకులు

వీరఘట్టంలో ఎన్టీయార్‌కు నివాళ్లు అర్పిస్తున్న జగదీశ్వరి, నాయకులు

సాలూరులో ఎన్టీయార్‌కు నివాళ్లు అర్పిస్తున్న అభిమానులు, నాయకులు

200 రోజులు ఉపాధి పని కల్పించాలి

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

ఉపాధి హామీ పనులను 200రోజులకు పెంచాలని, రూ.600 వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని పరజపాడులో ఉపాధి పనులు జరుగుతున్న తీరును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల పోరాటాలతో వచ్చిందన్నారు. ఈ చట్టం గ్రామాల్లో వ్యవసాయ కూలీల కుటుంబాల్లో వెలుగు నింపిందన్నారు. ఇలాంటి చట్టాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు, అందుకే ఉపాధి హామీ చట్టంలో రెండు పూటలా పని కల్పించి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది ప్రజలు గమనించాలని కోరారు. గతేడాది రూ.90వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే ఈ ఏడాది కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించి నిధులు తగ్గించారని అన్నారు. మేటీలకు ఇచ్చిన ప్రోత్సాహం సరిగ్గా ఇవ్వడం లేదని, పారలు, గునపాలు, తట్టలకు డబ్బులు వేయడం లేదని తెలిపారు. అంతేకాకుండా టెంట్లు, మెడికల్ కిట్లు మంచినీరు, మజ్జిగ సరఫరాను పూర్తిగా నిలిపివేశారన్నారు. వ్యవసాయంలో యంత్రాలు పెరుగుతున్నాయని, కరోనా తర్వాత కూలీలు వలసలు వెళ్లడానికి భయపడుతున్నారని, కనుక ఉపాధిని ఏడాదికి 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. రోజువారీ కూలీను సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతివారికీ పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం కోసం కూలీలంతా వ్యవసాయ కార్మిక సంఘంలో భాగస్వాములుగా వచ్చి పోరాటాలు చేయాలని కూలీలకు పిలునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి శ్రీనివాసరావు, కూలీలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : వేతనదారులతో మాట్లాడుతున్న గంగునాయుడు

సీతానగరం : మండలంలోని గుచ్చిమిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగు నాయుడు ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి కూలీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రెండు పూటలా పని పెట్టి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్షాల పోరాటాలతో వచ్చిన ఉపాధి హామీని పూర్తిగా ఎత్తి వేయడానికి బిజెపి చూస్తుందని సంఘం పెట్టుకొని పోరాడి ఉపాధి హామీని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యాకానుక కిట్లును పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

విద్యా కానుక కిట్లను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులకు అందజేయాల్సిన విద్యా కానుకల స్టాక్ పాయింట్ అయిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 12న ప్రారంభ పాఠశాలలు పున: ప్రారంభమవుతాయని, అప్పటికి విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు అందాల్సిన దుస్తులు, పాఠ్యపుస్తకాల వివరాలు పొందుపరచాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు, జి.సూర్యదేముడు, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు

వీరఘట్టం: ఈ ఏడాది విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు తెలిపారు. విద్యా కానుక కింద 448 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చాయని, ఒకటి నుండి పదో తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఓట్ల లెక్కింపుపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల సిబ్బందికి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలు, వివి పేట్‌ల లెక్కింపుపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాలకొండ, పార్వతీపురం ఆర్‌డిఒలు, ఎన్నికల అధికారులు వివి రమణ, కె.హేమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన కల్పిస్తూ ఏ విధంగా బాధ్యతలు నిర్వహించాలన్నది ఆడియో విజువల్ విధానం ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంబంధిత నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపక్కనున్న చెట్లను తొలగిస్తున్న సర్పంచ్ చైతన్యస్రవంతి

భారీ వృక్షం తొలగింపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ కోళ్ల ఫారం వీధిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న భారీ వృక్షాన్ని సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో తొలగించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీర్ఘకాలం నాటి వృక్షం పడిపోయే స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు సర్పంచ్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఆమె పంచాయతీ, ఎలక్ట్రికల్ సిబ్బందితో కలిసి భారీ వృక్షాన్ని తొలగించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించారు. పంచాయతీ పరిధిలో ఇదే తరహాలో ఉన్న మరో మూడు భారీ వృక్షాలను తొలగించినట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయం, ఎలక్ట్రికల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరమణనాయుడు

సమీక్ష లేకుండా ముగిసిన మండల సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి మూడు నెలలకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం ఈసారి ఎన్నికల కోడ్ పాటిస్తూ సమావేశం నిర్వహించినట్టు ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డి.వెంకటరమణనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వివిధ రకాల పనులకు సంబంధించి ఎటువంటి తీర్మానం లేకుండా సమావేశాన్ని మమ అనిపించే అర్ధాంతరంగా నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జంపు కన్నతల్లి -ఉమామహేశ్వరరావు, ఉప మండల అధ్యక్షులు పి.విజయకుమారి, వి.భార్గవ్‌తో పాటు ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులచే చదివిస్తున్న గ్రంథాలయాధికారి సుకన్య

వేసవి శిబిరాలపై విద్యార్థులు ఆసక్తి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలకు చిన్నారులు, విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారు. విద్యార్థులు గ్రంథాలయాల పట్ల మరింత ఆసక్తి చూపించేలా ఆటలు, పాటలు పోటీలతో పాటు చదువులో పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు పుస్తక పఠనం చేయిస్తున్నారు. మంగళవారం విద్యార్థులతో నీతి కథలు, జనరల్ నాలెడ్జ్, వార్తాపత్రికలు చదివించే కార్యక్రమం నిర్వహించామని గుమ్మలక్ష్మీపురం లైబ్రరియన్ డొనక సుకన్య తెలిపారు. వేసవిలో విద్యార్థులు ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా ఉండేందుకు శాఖా గ్రంథాలయం వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయని ఆమె తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, చదువుకోవాలనే తపన ఉంటుందని అన్నారు.

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత తెలుగు ఉపాధ్యాయుడు, యోగా, ఆధ్యాత్మిక గురువు కె. జనార్ధనరావు విద్యార్థులకు శ్లోకాలను సాధన చేయించారు. కార్యక్రమంలో ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్, చిన్నారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం : పిఒ

ప్రజాశక్తి - కురుపాం

మహిళలు వారి వ్యక్తి గత పరిశుభ్రత చాలా అవసరమని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కె. విజయగౌరి అన్నారు. మంగళవారం ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవ సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మహిళలు, యువతులకు వారి వ్యక్తిగత పరిశుభ్రత, వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే, ముఖ్యంగా వారు రుతు క్రమ సమయంలో పరిశుభ్రత పాటించడం చాలా అవసరమని అన్నారు. అలాగే వారు మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని, కావున ప్రతి మహిళ పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు భవాని, జానకి, గౌరమ్మ, విజయ గౌరి, శ్రావణి, బ్లాక్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: మహిళలు తమ వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపర్చుకొనేందుకు, రుతుక్రమం సమయంలో శారీరక పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని పాటించాలని ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఐసిడిఎస్ పార్వతీపురం సెక్టార్ పరిధిలో ఆరోగ్యం

కురుపాం : వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ విజయగౌరి

పోషణ విభాగం ప్రపంచ ఆరోగ్య సంస్థ యూనిసెఫ్ సూచనల ప్రకారం మెనుస్ట్రువల్ హైజీన్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, ఎఎస్ఒ నాయుడు, ఎపిఎం సురేష్, సూపర్ వైజర్లు గంగయ్య, క్లస్టర్ సీసీలు, విఒఎలు, కిశోర బాలికలు హాజరయ్యారు.

రహదారిపై కూలిన వృక్షం

కూలిన భారీ వృక్షం

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్‌రాష్ట్ర రహదారి పక్కన భారీ వృక్షాలు ప్రమాదకరంగా పడిపోయే స్థితిలో ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో కొన్నిచోట్ల ప్రమాదాలు బారిన ప్రజలు పడుతున్నారు. ఇలాంటి సంఘటనే మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో అంతర్ రాష్ట్ర రహదారి పక్కన ప్రమాదకరంగా భారీ వృక్షం ఉంది. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఈ భారీ వృక్షం రోడ్డుకు అడ్డుగా కూలిపోయింది. ఆ సమయంలో వాహనదారులు, ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. అప్పటికే ఆర్‌టిసి బస్సు, లారీ కొంచెంలో తప్పిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అంతర్ రాష్ట్ర రహదారికి అడ్డుగా భారీ వృక్షం నేలమట్టమవ్వడంతో సుమారు మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న కొమరాడ ఎస్సై నీలకంఠ ఆధ్వర్యంలో స్థానికుల సహాయంతో అంతరాష్ట్ర రహదారిపై పడిపోయిన భారీ వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్ లేకుండా యధావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగించారు.

ఇండియా వేదిక గెలిస్తే రాహుల్ గాంధే ప్రధాని

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇండియా వేదికలోని పార్టీలకు పట్టంకట్టబోతున్నారని, ఎన్నికల ఫలితాల అనంతరం రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కాబోతున్నారని పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన మోహన్ రావు అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలంతా ఇండియా కూటమి కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఎదురుచూస్తున్నార న్నారు. దేశంలో ప్రజలందరికీ సమాన న్యాయం కావాలని, పేదలకు బాసటగా నిలబడే ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తీళ్ల గౌరీశంకర్, నాయకులు పట్ల సింగ్ రవికుమార్, మీసాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తినిచ్చిన ఉపాధ్యాయ వృత్తి

ప్రధానోపాధ్యాయులు కొండగొర్రె సుబ్బారావు

ప్రజాశక్తి - సీతంపేట

ఉపాధ్యాయుడిగా, ఎస్‌ఆర్‌పిగా అనేక సేవలందించి పిల్లలను ఉన్నతులుగా తీర్చిద్ది వారి తల్లిదండ్రుల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడంతో ఉపాధ్యాయ వృత్తి తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ధోనుబాయి ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండగొర్రి సుబ్బారావు అన్నారు. తన 38 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో మారుమూల గిరిజన గ్రామాలైన పూతికవలస, పొల్ల, బొడ్డగూడ తదితర మారుమూల గ్రామాల్లో గిరిజన విద్యార్థుల మధ్య నిరంతరం ఉంటూ వారికి మెరుగైన విద్య ప్రమాణాలు అందించి ప్రయోజకులుగా మార్చడం తన జీవితంలో మరుపురాని సంఘటనలన్నారు. తాను చేసిన సేవలను గుర్తించే ముఖ్యమంత్రి, కలెక్టర్, ఐటిడిఎ పిఒల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా ఎన్నో అవార్డులు, రివార్డులూ అందుకున్నానన్నారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

1962లో సీతంపేట మండలం పెద్దూరులో జన్మించాను. ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు సీతంపేటలోనే విద్యాభ్యాసం సాగింది. ఇంటర్మీడియట్ కొత్తూరులోనూ, డిగ్రీ, బిఇడి, పిజి శ్రీకాకుళంలోనే కొనసాగింది. 1986లో కొత్తూరు మండలం బొడ్డగూడలో జివివికె) పాఠశాలలో గిరిజన విద్యా వికాస కేంద్రం సెకండ్‌గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ ప్రస్థానం

సిఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న సుబ్బారావు

ప్రారంభమైంది. 1989 వరకు అక్కడే కొనసాగింది. అక్కడ నుంచి సీతంపేట మండలం కంబగూడ జిపిఎస్ పాఠశాలలో 1989 నుంచి 1990 వరకు పనిచేశాను. అదే మండలంలో శంబాం ఆశ్రమ పాఠశాలకు సెకండ్ గ్రేడ్ టీచర్‌గా బదిలీపై వెళ్లాను. 1991 నుంచి 92 వరకు హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లాను. 1992లో కొత్తూరు మండలం గొట్టిపల్లి ఆశ్రమం పాఠశాలలో 1994 వరకు పనిచేశారు. 2000లో పెద్దపోల్ల గిరిజన బాలురు ఆశ్రమ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి 2005 వరకు పనిచేశాను. అనంతరం పూతికవలస, సామరెల్లి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. సామరెల్లిలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ఉన్నతి లభించి. ధోనుభాయి బాలుర ఆశ్రమం పాఠశాలలో 2006 నుంచి 2012 పనిచేశాను. అనంతరం ప్రధానోపాధ్యాయులుగా సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2012 నుంచి 22 పనిచేశారు. అనంతరం దోనుభాయి ఆశ్రమ పాఠశాలకు బదిలీ వచ్చి ఇక్కడే ఈనెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్నాను.

అన్నో అవార్డులు, రివార్డులు

ఉత్తమ ఉపాధ్యాయునిగా అనేక అవార్డులు రివార్డులు అందుకున్నాను. ఇందులో భాగంగా 1988లో ఉత్తమ ఎస్‌ఆర్‌సిగా రిపబ్లిక్ డే సందర్భంగా అప్పటి ఐటిడిఎ పిఒ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. 1989లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాటి ఎమ్మెల్యే నిమ్మక గోపాలరావు చేతుల మీదుగా ప్రశంసలు. 1996 ఉత్తమ ఉపాధ్యాయుడుగా, 2012లో పిఒ సునీల్‌రాజ్‌కుమార్ బెస్ట్ టీచర్ గా అవార్డు. 2014లో గిరిజన ఉత్సవాలు సందర్భంగా విద్యార్థులు గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శించినందుకు నాటి శ్రీకాకుళం కలెక్టర్ వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా అవార్డు. 2016లో బాగా చదివిన విద్యార్థులకు విజ్ఞాన దర్శన్ పేరిట ఎపి టూరిజం కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ చేతుల మీదుగా అవార్డు. 2019లో ఉమ్మడి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ ధనుంజయ రెడ్డి చేతుల మీదుగా అవార్డు. 2021లో కలెక్టర్ నివాస్ చేతుల మీదుగా అవార్డు. 2023లో దోనుబాయి ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థికి అత్యధిక మార్కుల దక్కడంతో జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు. అలాగే పార్వతీపురం జిల్లా ఫస్ట్ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా అవార్డు, సన్మానం.

ఎంతో మంది విద్యార్థులు స్థిరపడ్డారు

నా వద్ద చదువుకున్న గిరిజన విద్యార్థులు ఇప్పటికే ఉన్నతమైన ఉద్యోగాల్లో కొలువుదీరారు. వైద్యులుగా, ఇంజనీర్లుగా, పోలీసు అధికారులు, ఇలా పలుశాఖల్లో స్థిరపడ్డారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ యూనియన్ (టిడబ్ల్యూటియు) జిల్లా అధ్యక్షునిగా పనిచేసి గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు.

కుటుంబ నేపథ్యం

సీతంపేట మండలం పెద్దూరు కొండగొర్రి సూరమ్మ, గాసన్న దంపతులకు నాలుగో సంతానం. ముగ్గురు అక్కచెల్లెళ్లు, ఇద్దరు అన్నదమ్ములు. తండ్రి గాసన్న సర్పంచ్‌గా 1952 నుంచి 84 వరకు పనిచేశారు. 1990లో నీలవేణితో వివాహమైంది. ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలు ముగ్గురికి వివాహమైంది. కుమారుడు బిటెక్ చదువుతున్నాడు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిఐ రవికుమార్

పలు గ్రామాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని బందులుప్పి, ఎమ్మార్ నగరంలో మంగళవారం రూరల్ సిఐ రవికుమార్, ఎస్సై దినకర్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ పేరిట ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాత నేరస్తులు తమ ఇళ్లల్లో మారణాయుధాలుగాని, అక్రమ సారాయి నిల్వగానీ, ఇతర సంఘ వ్యతిరేక శక్తులకు సహకరించే వస్తువులైన మందు గుండు సామాన్లు నిల్వ చేస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికలు లెక్కింపు రోజున మండలమంతా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జనాలు గుంపులుగా గుమిగూడితే వారిపై పోలీసు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల అనంతరం ప్రశాంతమైన వాతావరణం కలిగి ఉండేందుకు గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై జయరావు పాల్గొన్నారు.

దొంగతనాలపై అవగాహన

మండలంలోని పెదబొండపల్లిలో ఉపాధి వేతనదారులతో పార్వతీపురం సిసిఎస్ ఎస్ఐ ఎంవి రమణ మండలంలో జరుగుతున్న దొంగతనాల తీరును వివరిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను వివరించారు. సెల్ ఫోన్లకు మెసేజ్లు వచ్చి బ్యాంకు కోడ్ నెంబర్లు చెప్పమన్నా, లాటరీ తగిలిందని ఫోన్లో వచ్చినా పోలీసులకు తెలియజేయాలని అన్నారు. అలాగే వేసవిలో ఇళ్లకు భద్రంగా తాళాలు వేసి జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు.

దాడి చేస్తే గాని స్పందించరా?

పట్టణంలో కుక్కలు స్వైరవిహారం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలోని వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నారు. దీంతో కుక్కలు గుంపు ఎవరిపై ఏ క్షణంలో దాడి చేస్తుందోనని ప్రజల భయగుప్పిట్లో బయటకు వస్తున్నారు. వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు స్థానికులు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు మాత్రం వాటిని పట్టుకొనేందుకు గానీ, వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు గానూ ఎలాంటి కారక్రమాలు చేయలేదు. దీంతో పాలకవర్గ సమావేశంలో ఈ సమస్యపై సభ్యులు మళ్లీ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలో పొందుపర్చారు. ఎట్టకేలకు కుక్కల నియంత్రణకు కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలపడంతో, ఆ దిశగా అధికారులు అడుగులు వేసి సుమారు 800 కుక్కలను పట్టుకుని వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి విడిచి పెట్టారు. అయినా పట్టణంలో అనేక చోట్ల కుక్కలు తిరుగుతూనే ఉన్నాయి.

పార్వతీపురం పక్కనే గల జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురంలో ఈనెల 11న బంటు లక్ష్మి అనే మహిళ బహిర్భూమికి వెళ్లిన సందర్భంలో కుక్కల గుంపు ఆమెపై దాడి చేయగా, తీవ్రంగా గాయపడి ఆమె మరణించింది. ఆ సంఘటన మరవక ముందే అదే మండలం బిత్తరపాడులో సోమవారం ఇద్దరు వ్యక్తులపై కుక్కలు దాడి చేయగా, అందులో ఒక వ్యక్తి మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి సంఘటనలు పట్టణంలో జరిగేందుకు అవకాశం ఉందని, ఎక్కడిక్కడ కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల దాడి జరగక ముందే వాటిని పట్టుకొనేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.

పట్టణంలో సంచరిస్తున్న కుక్కల గుంపు

గిరిజనుద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్ రామస్వామి

కొత్త జాబ్ కార్డులివ్వాలి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మండలంలోని రావికోన పంచాయితీ కొత్తవలసలోని గిరిజనులకు ఉపాధిహామీ కల్పించేందుకు జాబ్‌కార్డులు ఇవ్వాలని సర్పంచి, సిపిఎం నాయకులు కె.రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రావికోన,, రంగాలగూడ, కొత్తవలస గ్రామాల్లో ఉపాధి పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్తగా మళ్లీ జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. రావికోన పంచాయితీ పరిధిలో గల అన్ని గ్రామాల్లోనూ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం కె.ప్రసాద్, కె.మోహన్, ఎన్.నాగరాజు, ఎం.తులాసమ్మ, కె.పారమ్మ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో మళ్లీ ఎగిరేది వైసిపి జెండానే : జోగారావు

పార్వతీపురం రూరల్ : రాష్ట్రంతో పాటు పార్వతీపురం నియోజకవర్గంలో మళ్లీ ఎగిరేది వైసిపి జెండాయేనని వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండోసారి సిఎం జగన్మోహనరావు కావడం ఖాయమని, అలాగే తాను రెండోసారి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపిపిలు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని శివరాంపురంలో రైతులకు రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను మండల వ్యవసాయ అధికారి అనూరాధ అందజేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాలను 35-45 రోజుల్లోపు భూమిలో కలియదున్నుకోవాలని, పచ్చిరొట్ట ఎరువులు వేయడం వల్ల భూమి గుల్ల తనం వచ్చి పైరు ఆరోగ్యంగా పెరగడానికి దోహద పడుతుందని తెలిపారు. పచ్చిరొట్ట వేయడం వల్ల భూమిలో నత్రజని శాతం పెరుగుతుందని, నేల సారవంతంగా మారి, మంచి దిగుబడులు రాడానికి దోహద పడుతుందని తెలిపారు. అలాగే రసాయ ఎరువుల వాడకం తగ్గి తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గి లాభం చేకూరుతుందని వివరించారు. మండలంలో పచ్చిరొట్ట విత్తనాలు 482 మంది రైతులకు 95 క్వింటాళ్లను అందజేయనున్నామని, ఇంకా ఎవరికైనా అవసరమైతే ముందుగా గ్రామాల్లో ఉండే ఆర్‌బికెల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు ఇప్పటి వరకు నమోదు చేసుకున్న రైతులకు మంగళవారం నుంచిఈ విత్తనాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గిరి శిఖర గ్రామాలకు చెందిన రైతులకు రాగి విత్తనాలు 15 క్వింటాళు కొండ ప్రాంతాల్లో ఉన్న ఆర్‌బికెలకు వచ్చాయని, వీటిని కూడా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులంతా తమ పరిధిలో ఉన్న ఆర్‌బికెల వద్దకు వెళ్లి పేరు మనోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ మధుసూధనరావు, విఎఎ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎఇఒ అనురాధ